ఫారం 7 దరఖాస్తులు పుంగనూరు నుంచే ఎక్కువ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ఓటర్ల తొలగింపులకు అందిన ఫారం-7 దరఖాస్తుల్లో అధికంగా పుంగనూరు నుంచే ఉన్నాయి. ద్వితీయ స్థానంలో పలమనేరు, తృతీయస్థానంలో చిత్తూరు నియోజకవర్గాల నుంచి వచ్చాయి. గతనెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరిగింది. జాబితాను అనుసరించి ఓటర్ల పేర్లు నమోదు, తొలగింపులకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పేర్ల తొలగింపులకు జనవరి 23వ తేదీ నుంచి ఇప్పటివరకు 7419 దరఖాస్తులు అందగా, అవి పరిశీలనలో ఉన్నాయి. వాటిలో 243 దరఖాస్తుల తొలగింపులు జరిగాయి. నియోజకవర్గాల వారీగా పుంగనూరు నుంచి 1583, పలమనేరు నుంచి 1427, చిత్తూరు నుంచి 1128, గంగాధరనెల్లూరు (ఎస్సీ) నుంచి 885, పూతలపట్టు (ఎస్సీ) నుంచి 861, కుప్పం నుంచి 853, నగరి నుంచి 682 చొప్పున దరఖాస్తులు అందాయి. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం -7కు దరఖాస్తులు 0.2శాతం కన్నా ఎక్కువ వస్తే అట్టి ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనుమతి తప్పనిసరి చేస్తూ ఇటీవల ఆదేశాలందాయి. ఒకవేళ 0.2 శాతం లోపు ఉంటే వాటిని పరిశీలించేందుకు జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటయింది. కమిటీ పరిశీలన అనంతరం ఆ ఓట్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారి చర్యలు తీసుకుంటారు. పుంగనూరులో తొలగింపులు 0.04, చిత్తూరులో 0.04శాతం జరిగాయి. కాగా గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల పరిధిలో 0.01 శాతం జరగ్గా, నగరి, కుప్పంలలో తొలగింపులు ఇంకా ప్రారంభం కాలేదు. తాజాగా సోమవారం నాటికి పెండింగ్‌లో ఫారం - 7 దరఖాస్తులు నియోజకవర్గాలవారీగా.. పుంగనూరులో 1459, నగరిలో 579, గంగాధరనెల్లూరులో 766, చిత్తూరులో 872, పూతలపట్టులో 663, పలమనేరులో 1289, కుప్పంలో 744, వెరసి 6412 చొప్పున ఉన్నాయి.

అవును.. ఊరు ఇలా మారింది

పలు గ్రామాల్లో ఛిద్రమైన రహదారులు

డిప్యూటీ సీఎంను నిలదీస్తే టీడీపీ హయాంలో ఎందుకు వేసుకోలేక పోయారంటూ సెటైర్లు

గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి వెళ్లే దారి నుంచి గంగాధరనెల్లూరు పెద్దచెరువు కట్ట, కె.వెంకటాపురం, కె.వెంకటాపురం దళితవాడ, కలిజవేడు, నందనూరు వరకు ఐదు కిలోమీటర్ల మేర తారురోడ్డు ధ్వంసమైంది. పెద్దచెరువుకట్టపై స్కూలు వ్యాన్లు, ట్రాక్టర్లు వెళుతుంటాయి. ఎదురెదురుగా వచ్చినపుడు ఒక్కోసారి స్కూలు వ్యాన్లు పక్కనున్న చెరువులోకి.. లేదంటే మరోవైపు 25అడుగుల పల్లపు ప్రాంతమైన చెరుకుతోట(మడికట్టు)లోకి ఎక్కడ పడిపోతాయోనని పిల్లలు తల్లిదండ్రులు భయపడుతున్నారు.


పెద్దచెరువుకట్ట వద్ద..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రహదారుల బాగోగులను గాలికొదిలేసింది. దాంతో గంగాధర నెల్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. ఎంతలా అంటే.. కొన్ని రోడ్లపై ప్రయాణించాలంటేనే జనం హడలి పోతున్నారు. ఎప్పుడు ఎవరి ప్రాణం మీదకు వస్తుందోనని భయపడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, కంకర రాళ్లు తేలిపోయి ప్రతి రోడ్డూ ప్రమాదకరంగా మారింది. మరోవైపు చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణానికి మెటీరియల్ సరఫరా చేసే భారీ టిప్పర్ వాహనాల రాకపోకలతో ఇంకొన్ని గ్రామాల తారు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీనిపై పలు గ్రామాలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామిని స్థానికులు నిలదీశారు. అందుకాయన సమస్యను పట్టించుకోలేదు. పైగా.. 'మీరు టీడీపీ వారా.. అందువల్లే కావాలనే ప్రశ్నిస్తున్నారని నిందిస్తూ.. టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు ఎందుకు వేసుకోలేక పోయారు' అని సెటైర్లు వేశారు. అంతేకాకుండా.. 'మీ ఓట్లు నాకవసరం లేదు' అంటూ జనాన్నే దబాయించడం విమర్శల పాలైన విషయం తెలిసిందే.

\- గంగాధరనెల్లూరు


దళవాయిపల్లె, సంసాపురం గ్రామాల మధ్య..

బాలగంగనపల్లె మెయిన్ రోడ్డు నుంచి దళవాయిపల్లె, సంసాపురం మీదుగా కుమ్మరపల్లె రోడ్డును కలిసేవరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. వర్షాల్లొస్తే నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.


ఇ.ఆర్.కండ్రిగ ఎ.వెంకటాపురం మధ్యలో కల్వర్టు దగ్గర..

చిత్తూరు - తచ్చూరు హైవే నిర్మాణపనులకు సుమారు రెండేళ్లుగా ఇసుక, కంకర, మట్టిని భారీ టిప్పర్లతో తరలించడంతో గంగాధరనెల్లూరు నుంచి అగరమంగళం వేపంజేరి, వింజం, బాలగంగనపల్లె, వరత్తూరు, పెద్దకాల్వ, కొట్రకోన పంచాయతీల్లోని గ్రామాల్లో పలుచోట్ల తారు రోడ్లు కంకరరాళ్లు తేలి గుంతలతో నిండిపోయాయి. ఈ రోడ్లపై రేగుతున్న దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తవారు ఈ మార్గంలో రాత్రిపూట వస్తే ఆస్పత్రి పాలవ్వాల్సిందే.

తూగుండ్రం మెయిన్‌రోడ్డు నుంచి మంగినాయనికుప్పం, మహదేవమంగళం, తిరువీధి కుప్పం మీదుగా కడపగుంట కలిసేరోడ్డు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు అధ్వానంగా మారింది. మహదేవ మంగళం కట్టపై తారురోడ్డు కంకరరాళ్ల తేలి గుంతల కారణంగా కార్లు, ద్విచక్ర వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. రోడ్డులా ఉండటంతో ఈ మార్గంలో నడిచే చిత్తూరు - తిరువీధికుప్పం ఆర్టీసీ బస్సు సర్వీసునూ ఆపేశారు.


వి.లక్ష్మిరెడ్డిపల్లె బస్టాప్‌కు సమీపంలో..

కొశపల్లె దళితవాడ నుంచి ఒగ్గువారిపల్లె, కనికాపురం, బట్టుజంగనపల్లె మీదుగా మేనాటంపల్లె గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం రోడ్డు ధ్వంసమైంది. ఈ కారణంతో పాటు కలెక్షన్ల రావడం లేదని చిత్తూరు - కనికాపురం ఆర్టీసీ సర్వీసును ఆపేశారు.


మహదేవమంగళం చెరువుకట్టపై..


బట్టుజంగనపల్లె, ఒగ్గువారిపల్లెకు వెళ్లే దారిలో..

హత్యకేసులో ఎనిమిది మంది అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

నగరి, ఫిబ్రవరి 12: వాటర్ ప్లాంట్ యజమాని జగదీశ్ హత్యకేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. నగరిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన నిందితులను చూపి.. వివరాలు వెల్లడించారు. నగరి పట్టణ పరిధిలోని నెత్తంకండ్రిగ పంచాయతీ లక్ష్మీపురంలో ఫిబ్రవరి 3వ తేదీన వాటర్ ప్లాంట్ యజమాని జగదీశ్‌ను కత్తులతో నరికి హత్య చేశారన్నారు. ఈ హత్యకు వివాహేతర సంబంధం కారణమని తెలిపారు. గుండ్రాజుకుప్పం డంపింగ్ యార్డు వద్ద ఉన్న నిందితులు సుధాకర్, దాసుకుప్పానికి చెందిన మురళి, తిరువళ్లూరు రామదాసుపురానికి చెందిన మగేష్, తిరుపాచూరుకు చెందిన అజిత్, కడంబత్తూరులోని అధిగత్తూరుకు చెందిన హరిహరన్ కుమార్ అలియాస్ వసంత్, సూట్‌సూరి, రాజముత్తు, జయశంకర్‌బాలాజీను సోమవారం అరెస్టు చేశామన్నారు. వీరిని విచారించి హత్యకు దారితీసిన పరిస్థితులను రాబట్టినట్లు చెప్పారు. సుధాకర్ భార్యతో.. వీరి ఇంటి యజమాని జగదీష్‌కు వివాహేతర సంబంధం ఏర్పడిందన్నారు. దీంతో ఆమె భార్య విడాకుల కోసం కోర్టుకు వెళ్లడంతో జగదీష్‌పై సుధాకర్ కక్ష పెంచుకున్నాడన్నారు. అతడిని హత్యచేసేందుకు సత్యవేడు మండలం దాసుకుప్పానికి చెందిన మురళితో రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు ఫిబ్రవరి 3వతేదీన జగదీష్ కారు దిగి ఇంటికి వెళ్లే సమయంలో పొదల చాటున ఉన్న వసంత్ అనే వ్యక్తి జగదీష్‌పై దాడి చేయడంతో మృతి చెందాడని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.1.37 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, వేటకత్తిని స్వాధీనం చేసుకుని, కోర్టుకు హాజరు పరిచిన సీఐ సుధాకర్‌ను డీఎస్పీ ప్రశంసించారు.

అదంతా మేమే చేశాం..!

- కుప్పంలో టీడీపీ ఘనతను సొంతం చేసుకోవడానికి వైసీపీ ఉబలాటం
- సామాజిక వర్గాల మద్దతు వేటలో ప్రధాన పార్టీలు


టీడీపీ హయాంలో ముప్పావు వంతుకుపైగా పనులు పూర్తయి.. ఇటీవల పైపై మెరుగులు దిద్ది మంత్రి ప్రారంభించిన వన్నెకుల క్షత్రియ కమ్యూనిటీ భవనం

కుప్పం, ఫిబ్రవరి 12: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కుప్పంలో కులాల సమీకరణ ఎక్కువవుతోంది. ఎక్కడికక్కడ సభలు, సమావేశాలతో ప్రధాన పార్టీలు హోరెత్తిస్తున్నాయి. ఈ హడావుడిలో టీడీపీ పాలనలో ఆయా సామాజిక వర్గాలకోసం చేపట్టిన పనులను తమ ఖాతాలో వేసుకుని.. ఆ ఘనతను తమదిగా ఆపాదించుకోవడానికి అధికార పార్టీ ఉబలాటం ఎక్కువవుతోంది.

ఒక అంచనా ప్రకారం కుప్పంలో ఓటర్ల పరంగా 18.63 శాతంతో వన్నెకుల క్షత్రియ అగ్ర స్థానంలో ఉంది. ఎస్సీ, ఎస్టీలు, వాల్మీకి (బోయ)లు 14.5 శాతం, 8.12 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాలలో కొనసాగుతున్నారు. ఆ తర్వాత ముస్లిం, కురబ, యాదవ, వడ్డెర, గాండ్ల, రెడ్డి, కాపు, బలిజ సామాజికవర్గాలున్నాయి. ఈ క్రమంలో వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గాన్ని తమవైపు ఆకర్షించడానికి ఎక్కువగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుడుపల్లె మండల పరిధిలోని గుత్తార్లపల్లె సమీపంలో వన్నెకుల క్షత్రియులకు కోట్ల విలువైన స్థలాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారు. ఇక్కడ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అప్పట్లోనే సుమారు రూ.2 కోట్లను విడుదల చేశారు. చాలావరకు పనులు పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు మీద పడి వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. నాలుగున్నరేళ్ల కాలం మౌనంగా ఉండిపోయిన ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మిగిలిపోయిన అరొకర పనులు పూర్తి చేసి.. వన్నెకుల క్షత్రియ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తయిందనిపించింది. జనవరి 24వ తేదీన ఆ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించి ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించారు. టీడీపీ హయాంలోనే స్థలం కేటాయింపుతోపాటు ముప్పావువంతు భవన నిర్మాణం పూర్తయిందంటూ దీనికి వ్యతిరేకంగా టీడీపీ విస్తృత ప్రచారం చేసింది.

కురబల విషయంలోనూ ఇంతే

కురబల విషయానికి వస్తే, పీఈఎస్ సమీపంలోనే టీడీపీ హయాంలో ఒక ఎకరా స్థలాన్ని చంద్రబాబు కేటాయించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.50 లక్షలు విడుదల చేశారు. సగానికి పైగా నిర్మాణం పూర్తి అయింది. ఈ భవనం వద్ద కురబ కులస్తుల దైవం కనదాస విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకున్న టీడీపీ నాయకులు గత ఏడాది డిసెంబరులో విగ్రహాన్ని తెప్పించి ఉంచారు. ఆ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, అంతకంటే ముందుగానే స్థానిక ప్రభుత్వాసుపత్రి సర్కిల్‌లో కనదాస విగ్రహాన్ని హడావుడిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిచేత ప్రారంభింపజేశారు. ఆ తర్వాత డిసెంబరులో మూడు రోజుల పాటు కుప్పంలో పర్యటించిన చంద్రబాబు తాను కురబలకు కేటాయించిన స్థలంలో కమ్యూటీ భవనం ఎదుట అదే నెల 30వ తేదీన కనదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు. కురబలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఏకరువు పెట్టి, వైసీపీ ప్రచార ఆర్భాటాన్ని తూర్పారబట్టారు. వైసీపీ మాత్రం ఈ వర్గానికి తాము చేసింది ఏమీ లేకపోగా ఏదో చేసినట్లు చెప్పుకోవడానికి తహతహలాడుతోంది.

'గాండ్ల' సామాజిక వర్గం విషయంలోనూ..

టీడీపీ ఆధ్వర్యంలో గాండ్ల కులస్తుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆ వర్గాన్ని ఆకర్షించడానికి దానికి రెండు రోజుల ముందుగా వారికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వంనుంచి జీవో తీసుకొచ్చారు. ఎన్నికల ముందు జీవో హడావిడి ఏమిటి? ఇన్నాళ్లు ఏం చేశారంటూ టీడీపీ విమర్శిస్తోంది.

వైసీపీకి బలిజ సంఘం అల్టిమేటం

- తమను విస్మరిస్తే మరో కార్యాచరణకు సిద్ధం
- ఆసక్తికరంగా చిత్తూరు రాజకీయం

చిత్తూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో వైసీపీపై బలిజలు ఆగ్రహంతో ఉన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శని, సోమవారాల్లో బలిజ సామాజికవర్గం ప్రెస్‌మీట్లను నిర్వహించి మరీ ఆ పార్టీ అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేసింది. తమ సామాజిక వర్గానికి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా ఓసారి మోసం చేశారని, రాజ్యసభ హామీని నిలబెట్టుకోకుండా మరోసారి మోసం చేశారని ఆగ్రహించారు. తమ సామాజికవర్గానికి న్యాయం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేకుంటే తమ తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. గతేడాది నవంబరు 2న చిత్తూరులో జరిగిన సామాజిక బస్సు యాత్రలో డిప్యూటీ సీఎంలు, ఎంపీలు 'వచ్చే ఎన్నికల్లో ఆరణిని మరోసారి గెలిపించాల'ని అనధికారికంగా ప్రకటించారు. గతేడాది డిసెంబరు 2న సీఎంవో నుంచి ఆరణిని పిలిచి 'టికెట్ మళ్లీ నీకే ఇస్తున్నాం. కష్టపడు'అని హామీనిచ్చినట్లు సమాచారం. మళ్లీ జనవరి 2న పిలిచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం లేదు, రాజ్యసభకు పంపిస్తామని అధిష్ఠానం హామీనిచ్చింది. తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో ఆరణి పేరు లేకుండా పోయింది. ఇలా అడుగడుగునా బలిజలను అవమానిస్తున్న వైసీపీకి తమ పవర్ చూపిస్తామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. తమ సామాజిక వర్గానికి సంబంధించి రాయలసీమలో ఉన్న ఒకే ఒక ఎమ్మెల్యేకు సీటు ఇవ్వకుండా.. రెడ్డి సామాజిక వర్గానికే ఇవ్వడం ఏమిటని వారు ఆగ్రహిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో రాయలసీమలో ఉన్న 50 లక్షల మంది బలిజలు ఏకతాటి మీద నిలబడి వైసీపీకి బుద్ధి చెప్తామని అల్టిమేటం జారీ చేశారు.

'ఆరణి' ముందున్న దారులు

2019లో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచీ ఆరణి శ్రీనివాసులుకు నియోజకవర్గంలో బలమైన వ్యతిరేక వర్గం ఉండడంతో స్వేచ్ఛగా పనిచేయలేకపోయారు. ఇప్పుడు అదే వ్యతిరేకవర్గం ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకోవడంతో ఈయనకు మరింత అవమానం జరిగినట్లయింది. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి తనకు న్యాయం చేస్తారని పైకి చెబుతున్నా.. లోపల మాత్రం రాజకీయ భవిష్యత్తు గురించి ఏదో ఓ నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయాల నుంచి తప్పుకోవడం.. పార్టీ మారి ప్రస్తుత వ్యతిరేక వర్గం ఓడిపోయేందుకు పనిచేయడం.. ఈ రెండే ఆయన ముందున్న మార్గాలుగా ఆరణి సన్నిహితులు చెబుతున్నారు. ఎమ్మెల్యే టికెట్, రాజ్యసభ ఆఫర్ విషయంలో అధిష్ఠానం మోసం చేయడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ ఆయన చిత్తూరు వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసే అవకాశం లేనట్లు తెలుస్తోంది.

సీఆర్ఎస్‌లో సిలిండర్ పేలుడు



రేణిగుంట, ఫిబ్రవరి12: రేణిగుంట సమీపంలోని రైల్వే క్యారేజ్ రిపేరుషాపు(సీఆర్ఎస్)లో శనివారం రాత్రి 8.30గంటలకు ఓ గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. సీఆర్ఎస్‌లో సాధారణంగా శనివారం మధ్యాహ్నం నుంచి కార్మికులకు సెలవు.తిరిగి సోమవారం ఉదయం మాత్రమే పనులు ప్రారంభమవు తాయి.అయితే రైలుపెట్టెల మరమ్మతులు ఎక్కువ చేశామని గుర్తింపు తెచ్చుకోవడానికి అధికారులు రాత్రివరకు కాంట్రాక్టు కార్మికుల చేత పనులు చేయించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అదృష్టవశాత్తూ కోచ్ బాడీ రిపేరు (సీబీఆర్ షాపు)లో సిలిండర్ పేలినప్పుడు లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిసింది. విధుల్లో భాగంగా సోమవారం లోనికి వెళ్ళిన కార్మికులు సిలిండర్ పేలిందని గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు.గతంలో సిలిండర్ పేలి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ సంఘటనపై సీఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాపు మేనేజరు దేవసహాయాన్ని వివరణ కోరగా ప్రమాదం ఎలా జరిగిందన్న విషయమై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

జనసేన జిల్లా కో-ఆర్డినేటర్‌గా దినేష్ జైన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12: జనసేన పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా కె.దినేష్ జైన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

కనికల చెరువు వద్ద ఏనుగుల మంద మకాం

సోమల,ఫిబ్రవరి12:సోమల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల మంద ఆదివారం రాత్రి ఇర్లపల్లె సమీపంలో మకాం వేశాయి. మామిడి తోటల్లో తిరగాడి కొమ్మలను విరసివేశాయి. పూతకు వస్తున్న కొమ్మలు విరిగిపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. పగటి వేళ కనికల చెరువు వద్ద మకాం వేసి రాత్రి వేళల్లో పొలాల్లో తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కనికల చెరువు వద్ద నీటి నిల్వ ఉండడంతో ఆప్రాంతంలోనే తిరుగుతున్నాయని రైతులు తెలిపారు. దీంతో గొర్రెలు, మేకల పెంపకదారులు మేత కోసం వెళ్లడంలేదని తెలిపారు.

శ్రీకాళహస్తిలో విజృంభిస్తున్న మంప్స్

● అల్లాడుతున్న పిల్లలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తిలో గవదలమ్మ (మంప్స్) విజృంభిస్తోంది. వారం రోజుల నుంచి పిల్లల్లో అత్యధికంగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుండడంతో పిల్లలు అల్లాడిపోతున్నారు. దవడలు వాచిపోవడం తోపాటు జ్వరం సోకుతుండడంతో నీరసించిపోతున్నారు.గవదలమ్మ పారామిక్సో వైరస్‌తో మొదలై తర్వాత చెవులకు దగ్గరగా ఉండే పరోటిడ్ గ్రంథిపై ప్రభావం చూపుతుంది. గవదల వాపు రావడం జరుగుతుంది. కొందరిలో సెంట్రల్ న్యూరల్స్ సిస్టం (మెదడు)పై ప్రభావం చూపి ప్రాణాంతకంగా కూడా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ వైరస్ ఒకే గదిలో దగ్గరగా ఉన్నవారికి, అలాగే జలుబు, దగ్గు ఉన్నవారి నుంచి వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారం రోజుల తర్వాత లక్షణాలు బయటపడతాయి. వందలాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గాలి, వెలుతురు సక్రమంగా లేని తరగతి గదుల్లో చదువుకునే పిల్లలపై మంప్స్ ప్రభావం చూపు తోంది. వారం రోజుల నుంచి పిల్లలు గవదలు వాచిపోయి జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరస్ సోకిన వారిని ఎవరితో కలవకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పాఠశాలల్లో ఈ జాగ్రత్తలు విధిగా పాటించాలి. సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం తోపాటు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అప్రమత్తంగా వ్యవహరించాలి



పిల్లల్లో మంప్స్ వ్యాధిపై పెద్దలు అప్రమత్తంగా వ్యవహరించాలి. తీవ్ర సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంటుంది కాబట్టి మొదటి దశలోనే గుర్తించి జాగ్రత్తలు పాటించాలి. సహజ పద్ధతిలో వేపాకు, పసుపు మిశ్రమాన్ని అద్దవచ్చు.ఇతర పిల్లలతో కలవకుండా చూసుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉంచాలి. శరీరం వైరస్ ప్రభావంతో నీరసంగా మారుతుంది కాబట్టి ఆరు రోజులు ద్రవ పదార్థాలను అధికంగా తాగించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల విషయంలో తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

-డాక్టర్ వెంకటరామన్, సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు

టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలి

● అధికారులకు జేఈవో వీరబ్రహ్మం ఆదేశం

తిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి సోమవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఆలయాలతోపాటు అలిపిరి వద్ద పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ ఖాళీ స్థలాల్లో మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుని మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. శేషాచల అడవుల్లో అకేషియా చెట్ల స్థానంలో ఔషధ మొక్కలు పెంచాలన్నారు. 2025 టీటీడీ క్యాలెండర్లను స్థానిక ఆలయాల చిత్రాలతో మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, డీఎఫ్‌వో శ్రీనివాస్, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డీఈవో భాస్కర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై నైతిక బాధ్యతతో సీఎం రాజీనామా చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12: తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ సీఎం జగన్ రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్ల వ్యవహారం ఎమ్మెల్యేలు, మంత్రుల వల్ల అయ్యేది కాదని.. దీనివెనుక ముఖ్యమంత్రి హస్తముందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రెసిడెంట్ రూల్ తీసుకొస్తేనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. పీపీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను దేవుడు పంపిన దూతగా అభివర్ణించారు. తమిళనాడులో జయలలితలాగా ఏపీలో షర్మిల.. ముఖ్యమంత్రి అవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సూత్రధారులైన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించండి: బీజేపీ

తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రక్రియలో సూత్రధారుఐన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించాలని, నకిలీ ఎన్నికల అధికారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉప ఎన్నిక సమయంలో దొంగ ఓట్లు వేసిన వారిని పోలీసులకు అప్పజెప్పితే వారిని వదలేసి.. తమను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలికి నేడు సస్పెండ్ కావడం ప్రభుత్వ యంత్రాంగానికి గుణపాఠం అని చెప్పారు. ఎప్పుడో జరిగిన ఎన్నికలకు సాక్ష్యాలు లేవని వైసీపీ నేతలు సంబర పడుతున్నారన్నారు. దొంగ ఓట్ల విషయంలో అసలు దోషులను చట్టం ముందుంచేవరకు తాము పోరాడతామని స్పష్టం చేశారు.

ప్రైవేటు వెంచర్ కోసం చెరువులో బాట!

● శ్రీకాళహస్తిలో రియల్టర్ల ఆగడాలు

● అధికార పార్టీ అండతో బరితెగింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి పట్టణ శివారు లోని బసవయ్యపాలెం వద్ద లింక్ బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువుపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. చెరువు భూమికి ఆనుకుని వేసిన వెంచర్‌కు దారి కోసం ఏకంగా పైపులు వేసి చెరువునే చదును చేసే పనులకు శ్రీకారం చుట్టారు.ఆరు నెలల క్రితం లింక్ బైపాస్ రోడ్డు నుంచి మొదట చిన్న రోడ్డు ఏర్పాటు చేసి తర్వాత సుమారు రూ.20 కోట్ల చెరువు భూమి స్వాహా చేసేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు సాగించారు.ఈ విషయంపై శ్రీకాళహస్తిలో భూరాబందులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పనులాపేశారు.మళ్లీ డిసెంబర్ 25వ తేదీన బసవయ్యపాలెం చెరువులోకి బాట వేసేందుకు రాత్రికి రాత్రి చదును చేశారు.ఈ విషయాన్నీ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో మరికొంతకాలం చెరువు కబ్జాకు అడ్డుకట్ట పడింది.ఇటీవల కొయ్యల అమ్మకాలు చేసే కొందరు చెరువు భూమికి ఆనుకుని ల్యాండ్ కన్వర్షన్, అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేశారు.కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఒకరి భూమి గుండా రోడ్డు చూపుతూ ప్లాట్లు అమ్మేశారు.దీంతో ఆ భూమి యజమాని తన స్థలానికి కంచె వేసుకోవడంతో ప్లాట్లకు దారి లేకుండాపోయింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అమ్మకందారులను నిలదీయం మొదలుపెట్టారు.ఈ పరిస్థితుల్లో రియల్టర్లు బసవయ్యపాలెం పంచాయతీలోని ఓ కీలక వైసీపీ నేతతో చేతులు కలిపారు. చెరువు భూమిలో పైపులు వేసి బైపాస్ నుంచి ప్లాట్లకు రోడ్డు వేసేందుకు పథకం రచించారు. అధికారుల చేతులు తడపడంతో ఇక అడిగే వారుండరన్న ధీమాతో సిమెంట్ పైపులను దించి రాత్రివేళ చెరువు భూమిలో బాట వేసేందుకు సన్నద్ధమయ్యారు.సోమవారం సాయంత్రం చెరువును పూడ్చేందుకు పొక్లయినరును కూడా తరలించారు. అర్ధరాత్రి సిమెంట్ పైపులపై టిప్పర్లతో మట్టి తోలేందుకు సిద్ధమయ్యారు. బైపాస్ నుంచి ఇదే రోడ్డు ఏర్పాటయితే మొత్తం చెరువుకు చేటు తప్పదు. అందుకే గత పాలకులు చెరువులోకి బాటలు వేయకుండా రక్షించారు.అయితే ఇప్పటి పాలకులు రియల్టర్లతో చేతులు కలిపి చెరువు భూమిని అరగించేందుకు సిద్ధమయ్యారు.

పేటమిట్టకు ఆధ్యాత్మిక శోభ

● వేడుకగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం





పేటమిట్టలో ఏర్పాటు చేసిన యాగశాల - ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు



పూజల్లో పాల్గొన్న గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి దంపతులు

పూతలపట్టు, ఫిబ్రవరి 12: ఓవైపు పచ్చని తోరణాలు. మరోవైపు విద్యుత్ దీపాలంకరణతో పేటమిట్ట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. చిత్తూరు- కడప జాతీయ రహదారిలోని తలపులపల్లి నుంచి పేటమిట్ట వరకు రోడ్డుకు రెండువైపులా శ్రీరామ పతాకాలు రెపరెపలాడాయి. పూతలపట్టు మండలం పేటమిట్టలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. అమరరాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబ సభ్యుల తొలి పూజతో ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు సమస్త దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పేటమిట్ట, గణపతిరావూరు, పోటుకనుమ, కరణంవారిపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో ఊరేగించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 10 గంటలకు గల్లా కుటుంబీకులు ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో విరుపాక్షమ్మ గుడి వద్దకు వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం యాగశాలకు చేరుకుని, అక్కడ గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీపారాధన వంటి పలు పూజాకైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం శాలివాహనం, షోడసస్తంభార్చన, అఖండదీపారాధన, వాస్తు మండపారాధన, వాస్తు హోమం, వాస్తు పర్యగ్నికరణం, వాస్తుబలి, క్షేత్రపాలక యోగని, నవగ్రహ మండపారాధన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసి, సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. గల్లా కుటుంబీకులతో పాటు సర్పంచి గల్లా రాధాకృష్ణ, ట్రస్ట్ సెక్రటరీ గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామానాయుడు, ట్రస్టు సభ్యులు భానుమూర్తి నాయుడు, గల్లా రాజగోపాల్, గల్లా సంపత్ నాయుడుతో పాటు వీఆర్వోలు బాబ్జీ, చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

శ్మశానానికి మా భూమే కావాల్సి వచ్చిందా..!

● అధికారులతో కలిసి అధికారపార్టీ నేతల ప్రయత్నం

● 'స్పందన'లో దళిత మహిళ ఆవేదన

చిత్తూరు, ఫిబ్రవరి 12: 'మా అనుభవంలో ఉన్న భూమిపై అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ భూమిని శ్మశాన వాటికగా మార్చేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి ప్రయత్నిస్తున్నారు' అంటూ చిత్తూరు మండలం అనుప్పల్లెకు చెందిన దళిత మహిళ నిరూప ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె దళిత సంఘాల నేతలతో కలిసి కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా వివిధ సమస్యలతో సోమవారం పలు ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని స్పందన కార్యక్రమంలో వినతులిచ్చారు. డ్వామా పీడీ రాజశేఖర్, ఆర్డీవోలు వినతిపత్రాలను స్వీకరించారు. బాధితుల సమస్యలను విన్నవారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎండలు ప్రారంభమైన నేపథ్యంలో అర్జీదారుల సంఖ్య తగ్గింది. 212 మంది వినతిపత్రాలను అందించారు. ఇందులో రెవెన్యూశాఖకు 156, రేషన్‌కార్డులు, పెన్షన్ల కింద 12, పోలీసుశాఖకు 12 అర్జీలు పోనూ మిగిలిన శాఖలకు సంబంధించి అర్జీలున్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన వాటిలో కొన్ని..



అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

పోలీసు స్పందనకు 18 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు జిల్లా నలుమూలల నుంచి 18 మంది హాజరై వినతిపత్రాలను అందించారని ఎస్పీ జాషువా తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఇందులో భూ తగాదాల కింద 9, చీటింగ్ 4, ఆస్తి తగాదాలు 3, భర్త వేధింపులు 2 చొప్పున అర్జీలు అందాయి. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ అరీఫుల్లా, డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సంఘ సభ్యులు నిర్వహిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా జీవామృతం, ఘన జీవామృతాలతో పండించిన ఆకు కూరలు, కూరగాయలను విక్రయిస్తున్నారు. తాజాగా ఉండటంతో మహిళా ఉద్యోగులు కొనుగోలు చేశారు. గత పది వారాలుగా ఇక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అధికారులకు అవగాహన ఉండటం వల్ల చాలామంది తీసుకుంటున్నారని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. ఎస్ఎఫ్ఏ మార్కెటింగ్ నిర్వాహకురాలు ఫైజున్నీషా, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



హమాలీ హెడ్ లోడ్ యాక్ట్ చట్టాన్ని అమలు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు జరిగిన హమాలీ వర్కర్ల ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షల మంది వరకు పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో హమాలీ హెడ్‌లోడ్ యాక్ట్ చట్టం అమలులో ఉందని, ఇక్కడ మాత్రం లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న విధంగానే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కార్మికులకు ఏడాదికి ఒకసారి వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, నాయకులు మణి, రఘు, కృష్ణన్, కమల్, మణి, హమాలీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామానికి దారి వసతి కల్పించండి



తమ గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ జీడీనెల్లూరు మండలం కొల్లావూరు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కొట్రకోన పంచాయతీ కొల్లావూరుకు ఉన్న చిన్నదారి ఆక్రమణకు గురికావడంతో పూర్తిగా దారిలేకుండా పోయిందన్నారు. జరగరాని సంఘటన ఏదైనా జరిగితే అంబులెన్స్ రావడానికి కూడా దారి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎవరిని అడిగి ఉద్యోగులను నియమించారు ?

● వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించిన సీహెచ్‌సీ చైర్‌పర్సన్



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ యశోదారెడ్డి

పెనుమూరు, ఫిబ్రవరి 12: ఎవరిని అడిగి ఉద్యోగులను నియమించారని సిబ్బంది, డాక్టర్లను సీహెచ్‌సీ చైర్మన్ యశోదారెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆమె మండల వైసీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మరి కొందరు నాయకులతో పెనుమూరు సీహెచ్‌సీని సందర్శించారు. నూతనంగా నియమితులైన శానిటేషన్ ఉద్యోగులను పిలిచి మీకు ఎవరు ఉద్యోగం ఇచ్చారని అడిగారు. అందుకు వారు సమాధానం చెప్పలేకపోయారు. సీహెచ్‌సీ హెడ్ డాక్టర్ గీతాకుమారి రెండు రోజులు సెలవులో ఉండటంతో ఆమెకు ఫోన్ చేసి నలుగురు శానిటేషన్ సిబ్బంది, ఒక సెక్యూరిటీని ఎవరు నియమించారని, చైర్మన్‌కు గానీ డిప్యూటీ సీఎంకు గానీ సమాచారం లేకుండా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఆరు నెలలుగా ఖాళీలు ఉంటే చెప్పాలని వైసీపీ నాయకులు అడుగుతున్నా ఖాళీలు లేవని చెప్పి ఇప్పుడు ఎలా, ఎవరు చేర్చుకున్నారని అడిగారు. తాను సెలవులో ఉన్నానని, నేరుగా వచ్చి మాట్లాడతానని డాక్టరు సమాధానం చెప్పారు. డిప్యూటీ సీఎంకు విషయం తెలిపేవరకు వారిని విధుల్లోకి తీసుకోరాదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పండరీనాథ్, రామకృష్ణ, యతీశ్వర్ నాయుడు, నరసింహారెడ్డి, కిరణ్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు డబ్బులకు అమ్ముకున్నారని ప్రచారం

పెనుమూరులోని సీహెచ్‌సీలో కాంట్రాక్టు పాతిబేసిస్‌గా శానిటేషన్ ఉద్యోగాలను అధికారపార్టీకి చెందిన ఓ నేత, మరో అధికారితో కలిసి అమ్ముకున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై పలువురు అడిగినా చైర్‌పర్సన్ చెప్పారని అనడం దుమారం లేపింది. దీంతో సీహెచ్‌సీ చైర్‌పర్సన్ యశోదారెడ్డే విచారించారు. తన పేరు ఎలా చెబుతారు.. ఎవరు మిమ్మల్ని చేర్పించారో చెప్పాలని ఆ ఉద్యోగులను అడగ్గా, వారు సమాధానం చెప్పకుండా కంటతడి పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంలో ఎవరి పాత్ర ఉందో తేలేవరకు విధులకు రాకూడదని ఆమె చెప్పారు.

ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్







రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు రాకెట్ తరలింపు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించి అనుసంధాన పనులు పూర్తయ్యాయి. 2,275 కిలోల బరువు గల కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగించేందుకు షార్ శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ- మార్క్2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం ఇస్రో ఈ ప్రయోగం చేపట్టిన విషయం తెలిసిందే. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో (వ్యాబ్) రాకెట్ మూడు దశల అనుసంధాన పనులతో పాటు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను పూర్తి చేసి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించారు. ప్రయోగ వేదిక ఉన్న జీఎస్ఎల్వీ రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలను చేపడుతున్నారు. తుది పరీక్షల అనంతరం లాంచ్ రిహార్సల్, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించారు. అన్నీ సజావుగా సాగితే ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది.



ప్రయోగ వేదికపై రాకెట్

టీడీపీలోకి 25 వైసీపీ కుటుంబాలు



కుప్పం, ఫిబ్రవరి 12: కుప్పం మండలం వేపూరు మిట్టపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 25 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నంలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టీడీపీలో ఉండి కొందరి మాటలు నమ్మి వైసీపీలోకి వెళ్లిన 25 కుటుంబాలు వాస్తవాలు తెలుసుకుని తిరిగి తమ పార్టీలో చేరడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ ఆర్.చంద్రశేఖర్, కన్నన్, డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ యూత్



కుప్పం, ఫిబ్రవరి 12: కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లెకు చెందిన యువకులు శశాంక్, అజిత్, దిలీప్, హరీశ్, వసంత్ కుమార్‌లు సోమవారం వైసీపీనుంచి టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 12: పులిచెర్ల మండలంలో సుమారు రూ.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. మతుకువారిపల్లి వద్ద బీసీ బాలికల గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ముందుగా దిగువపోకలవారిపల్లిలో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన మంత్రి సుడిగాలి పర్యటన చేపడుతూ 40 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావేటిగారిపల్లి సచివాలయాన్ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి మండల పర్యటన ముగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ షన్మోహన్, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, సాంఘిక, బీసీ సంక్షేమఅధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగరాజప్రసాద్, తహసీల్దార్ వసంతలత, ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు చోట్ల తెగిపడిన విద్యుత్ వైర్లు

తప్పిన పెను ప్రమాదాలు

కల్లూరు, ఫిబ్రవరి 12: కల్లూరులోని మూడు ప్రాంతాల్లో సోమవారం 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడిన ఘటనలో పెను ప్రమాదాలు తప్పడంతో ప్రజలు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. జడ్పీ బంగళా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొగలు రాగా 11కేవీ విద్యుత్ వైర్లు నేలపై తెగిపడ్డాయి. పీలేరు రోడ్డులోని బిస్మిల్లా హోటల్ సమీపంలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడటంతో ప్రజలు పరుగులు తీశారు. టీటీడీ కళ్యాణ మండపానికి వెళ్లే మార్గంలో 11 కేవీ విద్యుత్ స్తంభంలో రెండు చోట్ల వైర్లు తెగిపడ్డాయి. పట్టణంలో మూడుచోట్ల ఒకే సమయంలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడటంతో పాకాలలో 33కేవీ విద్యుత్ లైను ట్రిప్ అయింది. దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఇదే సమయంలో పట్టణంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన కొనసాగుతుండటంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. సుమారు 5గంటల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించడం వల్లే ప్రమాదాలు



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ, ఆర్టీవో అధికారులు

పుంగనూరు, ఫిబ్రవరి12: రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు ఎంవీఐ సుప్రియ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పురవీధుల్లో ఆర్టీసీ, ఆర్టీవో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య, సిబ్బంది కరీముల్లా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి



కందూరులో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట నరసింహులు

సోమల,ఫిబ్రవరి12: రాబోవు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ వెంకటనరసింహులు కోరారు. సోమవారం సాయంత్రం కందూరు బస్టాండ్‌లో గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పార్టీలు పరంగా ఎలాంటి గొడవలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లుకు పలు సూచనలు చేశారు. అనంతరం కలికిరి - కందూరు మార్గంలో చెక్ పోస్టును ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దామోదరం, దేవరాజులు, ప్రతాప్ పాల్గొన్నారు.

ధ్యానాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 : కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం హనుమంత వాహనోత్సవం జరిగింది. అర్చకులు సీతాలక్ష్మణసమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య స్వామివారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. కాగా మంగళవారం శేష వాహనోత్సవం, 14న కల్యాణోత్సవం, గరుడసేవ, 15న గజవాహనం, 16న రథోత్సవం, 17న అశ్వవాహనం, దోపోత్సవం, 18న హంసవాహనం, శయనోత్సవం, 19వతేది పుష్పయాగోత్సవం, నెమలివాహనం, సూర్యప్రభ ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

21, 22 తేదీల్లో తీర్థంలో గంగమ్మ ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 : తీర్థం గ్రామంలో పునర్నిర్మాణం గావించబడిన తిరుపతి గంగమ్మ ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 21వ తేది సాయంత్రం అమ్మవారి నూతన విగ్రహం ఊరేగింపు, మహాగణపతి పూజ, గంగపూజ, కలశస్థాపన, గణపతి హోమం, పూర్ణాహుతి, 22న రుద్రహోమం, ధన్వంతరి హోమం, కలశాభిషేకం, అమ్మవారి విగ్రహప్రతిష్ఠ జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

ఆర్డీవో స్పందనకు 9 అర్జీలు

పలమనేరు : పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో 9 మంది ఆర్డీవో మనోజ్‌కుమార్‌కు అర్జీలు అందజేశారు. మండలాల వారీగా పుంగనూరు 2, గంగవరం 3, బైరెడ్డిపల్లి, వి.కోట, చౌడేపల్లి, సోమల మండలాలనుంచి ఒక్కొక్క అర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

యువతా మేలుకో..భవిష్యత్తును కాపాడుకో

మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి12 : యువతా మేలుకో, నీ భవిష్యత్తును కాపాడుకో అంటూ మాజీ మంత్రి అమరనాథరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం పలమనేరు మున్సిపాలిటీలో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని చర్మాకాలనీ, విద్యానగర్‌కాలనీ, శ్రీనగర్‌కాలనీ, మిషన్‌స్కూల్ వీధి, తపాల మునస్వామివీధి, జీయప్పవీధి, మునిపాపన్నవీధి, గుడియాత్తంరోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చర్మాకాలనీ, నగర్‌కాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అనుసరించిన విధానాల వలన యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఇకనైనా యువత మేల్కొని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, పలమనేరు మాజీ సర్పంచ్ ఆర్వీ బాలాజి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, నాగరాజు, సుబ్రమణ్యంగౌడు, రమేష్, మోహన, శ్రీనివాసులు, లోకేష్ ఆచారి, మదన్‌మోహన్, ప్రమీల, సుధాకర్, నదీం, మురళి, సుబ్రమణ్యం లతో పాటు జనసేన నాయకులు దిలీప్, చైతన్య, నాగరాజు, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు శ్రీనగర్ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించిన అమరనాథరెడ్డి

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి : చల్లా



పోస్టరును ఆవిష్కరిస్తున్న చల్లాబాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 12: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్లలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యువ ఓటర్లకు చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, ఓటు మన హక్కుగా భావించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయగల నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. డబ్బుతోనో, మద్యంతోనో ఓటు కొనచ్చనే భావంతో నాయకులు ఉన్నారని, దాన్ని తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనందగౌడ్, పుంగనూరు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కాలవగడ్డ మునీంద్ర, ఉపాధ్యక్షుడు హేమాద్రి, తెలుగుయువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గునిగింటి దేవేంద్ర, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షురాలు షబానా, మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి అంజాద్‌ఖాన్, మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా, మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, ఐ-టీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు గూడూరు హరిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే వన్నెకుల క్షత్రియులకు న్యాయం

కుప్పం, ఫిబ్రవరి 12: వన్నెకుల క్షత్రియులకు న్యాయం చేసిన పార్టీ ఆదినుంచీ టీడీపీయేనని ఆ పార్టీకి చెందిన ఆ సామాజిక వర్గం నేతలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మునిరాజు, మాజీ ఎంపీపీలు సాంబశివం, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గౌరవంకానీ, పదవులు కానీ దక్కలేదని శ్రీకాళహస్తిలో జరిగిన సమావేశంలో మంత్రి మోపిదేవి వెంకటరమణ చేసిన, ఇతర నాయకులు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. వైసీపీ సమావేశం జరిగిన శ్రీకాళహస్తిలోనే వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన దివంగత మునిరామయ్యను ఎమ్మెల్యే చేసిన ఘనత టీడీపీదేనన్నారు. అదే కులానికి చెందిన పేట రాధారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ హయాంలోనే పదవి అనుభవించారని గుర్తు చేశారు. కొల్లు రవీంద్రతోపాటు ఆయన తండ్రికి కూడా మంత్రి పదవి ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. ఇంకా టీడీపీ హయాంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వన్నెకుల క్షత్రియులకే కాదు, బీసీలకు ఏమి చేసిందో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో టీడీపీకి చెందిన పలువురు వన్నెకుల క్షత్రియ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వన్నెకుల క్షత్రియ నాయకులు

కాపాడమిట్టపల్లెలో పారిశుధ్య పనులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి12: కమ్మరనత్తం పంచాయతీ కాపాడమిట్టపల్లెలో అధికారులు పారిశుధ్యం పనులు చేపట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం అనే వార్త ప్రచురితం కావడంతో సోమవారం అధికారులు గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ వేయించారు. వీధులపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి తెలిపారు.

'కేసులకు భయపడం'

పుంగనూరు, ఫిబ్రవరి12: వైసీపీ ప్రభుత్వం ఎన్ని రౌడీషీటర్ల కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా, ఎస్సీ రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి రమణ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను అణచివేయాలని చూస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పేరు ఉన్న నాయకులు, కార్యకర్తలపై పలు రకాల కేసులు నమోదు చేయించిన ఘనత వైసీపీకి దక్కిందని, ఎన్ని కేసులు పెట్టినా తాము ముందుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

టీడీపీ అధికారంలో ఉంటేనే పల్లెసీమల ప్రగతి

శాంతిపురం, ఫిబ్రవరి 12: తెలుగదేశం పార్టీ అధికారంలో ఉంటేనే పల్లెసీమల ప్రగతి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు, కోనేరుకుప్పం, సి.బండపల్లె పంచాయతీలలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు నేతృత్వంలో గ్రామ వికాస సమావేశాలు ఏర్పాటు చేశారు. గతంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని వివరిస్తూ, పల్లెలకు అవసరమైన కార్యచరణను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న 60 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని, అందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీచ నేతలు నాగరాజు, చంద్రశేఖర్, మణి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, జనసేన అధ్యక్షుడు కిషోర్‌కుమార్, ప్రకాష్, జనవరాజ్, జయరాజ్, మరళీ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



సోమల, ఫిబ్రవరి 12: సోమల మండలం పెద్ద ఉప్పర పల్లెకు చెందిన పి.వెంకటరెడ్డి వ్యవసాయ పొలం వద్ద వరి కోతల అనంతరం నిల్వ చేసిన వరి గడ్డి ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని అగ్గికి ఆహుతైంది. సమీప రైతులు, గ్రామస్తులు మంటలు పొలాల వైపు వ్యాపించకుండా బిందెలతో నీళ్లు తెచ్చి కాపాడుకున్నారు.

నీలగిరి తోటలో అగ్గి మంటలు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి12: భీమగాని పల్లె సమీపంలో నీలగిరితోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తీవ్ర నష్టం జరిగినట్లు అగ్నిమాపకాధికారి సుబ్బరాజు తెలిపారు. సోమవారం భీమగానిపల్లెకు చెందిన నంజుండప్ప, లక్ష్మయ్యల నీలగిరి తోటలకు నిప్పుపెట్టడంతో నష్టం జరిగినట్లు ఆయన తెలిపారు.

పలమనేరు టికెట్ కోసం దరఖాస్తు

వి.కోట, ఫిబ్రవరి 12: పలమనేరు అసెంబ్లీ కాంగ్రెస్ టిక్కెట్టు తనకు కేటాయించాలని ఏపీసీసీ సభ్యుడు బి.ఇనాయతుల్లాఖాన్ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కోరారు. నగరిలో జరిగిన సభలో పాల్గొన్న ఇనాయతుల్లాఖాన్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ దఫా జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీ కోటా కింద తనకు కాంగ్రెస్ పార్టీ తరపున బిఫారం కేటాయించాలని కోరారు. ఈ మేరకు తన దరఖాస్తును ఆమెకు అందజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలు ఉన్నారు.

టీడీపీ నాయకులపై రౌడీషీట్లు తెరవడం దుర్మార్గం

కల్లూరు, ఫిబ్రవరి 12: పుంగనూరు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై రౌడీషీట్లు తెరవడం దుర్మార్గమని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ మండిపడ్డారు. పులిచెర్లలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అక్రమకేసులు పెట్టడం, హత్యచేసి డోర్ డెలివరీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అక్రమకేసులు, రౌడీషీట్లపై న్యాయస్థానంలో తేల్చుకుంటామని, అక్కడ తప్పక న్యాయం జరుగుతుందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

వి.కోట, ఫిబ్రవరి 12: మండల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీఐ లింగప్ప రెవెన్యూ సిబ్బందితో కలసి పరిశీలించారు. సోమవారం కొంగాటం, తోటకనుమ, బోయచిన్నాగనపల్లె, బైరుపల్లె, కృష్ణాపురం, గోనుమాకులపల్లె, జవ్వునిపల్లె, పాముగానిపల్లె, పెద్దబరిణేపల్లె, ముదరందొడ్డి, యాలకల్లు పంచాయతీలకు చేరుకుని అక్కడ పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. పోలింగ్ సిబ్బందికి కావాల్సి సదుపాయాలపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. వి.కోటలోని తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కేంద్రంలో సుమారు మూడువేల మంది ఓటర్లు వచ్చి వెళ్ళేందుకు కేవలం ఒకే ముఖద్వారం ఉందని, అంతమంది వచ్చి, వెళ్ళడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఈ కేంద్రాన్ని సమీపంలోని బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలోకి మార్పు చేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

జనసేనలోకి భారీగా చేరికలు

వి.కోట, ఫిబ్రవరి 12: చిత్తూరు జనసేన కార్యాలయంలో ఇన్‌చార్జి డీకే.చైతన్య రాయల్ ఆధ్వర్యంలో వి.కోట మండలానికి చెందిన వైసీపీ కుటుంబాలు భారీ ఎత్తున జనసేనలో చేరారు. వి.కోటకు చెందిన కె.రెడ్డిభాస్కర్, బోయచిన్నాగనపల్లెకు చెందిన వైసీపీ కార్యదర్శి కుప్పస్వామి, ఉష, సుశీలమ్మ, డి.రాజేంద్ర, మహేష్, రామూర్తి, వినాయక, విజయ్, వినోద్ పాటు సుమారు 30మంది యువకులు వారి కుటుంబ సభ్యులతో కలసి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షులు పూలచైతన్యమోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిలీప్, మండల అధ్యక్షులు బాబు, నాయకులు చైతు, విజయ్, గణేష్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి

రామకుప్పం, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ మరాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాజుపేట, చెల్దిగానిపల్లె గ్రామాల్లో జరిగిన గ్రామ వికాస సమావేశాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నేతలు మహ్మద్‌రఫీ, విజయకుమార్‌రెడ్డి, నారాయణస్వామి, సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సారా స్థావరాలపై దాడి

రామకుప్పం, ఫిబ్రవరి12: మండలంలలోని గట్టూరుతాండా,చిక్కపల్లె తాండా ,బాలాజీ కుంట అటవీ ప్రాంతాల్లో సెబ్, పోలీసులు కలసి చేసిన దాడుల్లో సుమారు 3వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ములు, క్యాన్లు, ఇనుప డ్రమ్ములను ధ్వంసం చేశారు.

సచివాలయం తనిఖీ

శాంతిపురం, ఫిబ్రవరి 12: పేదల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమ వారం క్షేత్రస్థాయిలో కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అధికారుల హాజరుపట్టిక, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ కొలేష్, ఆర్ఐ మధుసూదన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం పనిచేద్దాం



మాట్లాడుతున్న జిల్లా టీబి నివారణ అధికారి వెంకటప్రసాద్

గంగవరం, ఫిబ్రవరి 12 : టీబీ రహిత సమాజ స్థాపన కోసం వైద్యాధికారులు, సిబ్బంది కలసికట్టుగా పనిచేయాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మధు కళాశాలలో పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల వైద్యాధికారులు, సిబ్బందితో టీబీ నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 కల్లా ప్రపంచవ్యాప్తంగా టీబీ కేసులను సమూలంగా నిర్మూలించాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్ణయించిందన్నారు. దీనికి అనుగుణంగా మన ఆరోగ్యశాఖ కూడా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి టీబీ, షుగర్, దీర్ఘకాలిక శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారందరినీ గుర్తించి ముందస్తు డోస్‌లు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్, నందిని, నిరంజన్ పాల్గొన్నారు.

కుప్పం డీఎస్పీగా శ్రీనాథ్ బాధ్యతల స్వీకరణ



కుప్పం, ఫిబ్రవరి 12 : కుప్పం సబ్ డివిజన్ డీఎస్పీగా బండారు శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో నూతనంగా ఏర్పాటైన కుప్పం సబ్ డివిజన్ తొలి డీఎస్పీగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా భీమవరం డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీధర్ కుప్పం డీఎస్పీగా బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయనను సబ్ డివిజన్ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ కుప్పం సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

సచివాలయం-2 ప్రారంభం

కుప్పం, ఫిబ్రవరి 12: కుప్పం పాత సబ్ ట్రెజరీ కార్యాలయంలో సోమవారం సచివాలయం 2ను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటిదాకా మున్సిపాలిటీలోని 16, 17, 22 వార్డులకు సంబంధించిన సచివాలయం-2 కూడా పార్కు వెనుక గల సచివాలయం-2లోనే నడిచేదన్నారు. ఇప్పుడు కొత్తగా సచివాలయం-2ను ఇక్కడకు మార్చినట్లు చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



చౌడేపల్లె, ఫిబ్రవరి 12: చౌడేపల్లెలో మారెమ్మ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు ప్రతిష్ఠించారు. సోమవారం చౌడేపల్లె చెరువు సమీపంలో ఉన్న గ్రామ దేవత ఆలయంలో నూతనంగా విజయవాణి సంస్థల అధినేతల సహకారంతో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి, నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కుప్పం టీడీపీలో సంస్థాగత మార్పులు

కుప్పం,ఫిబ్రవరి12: కుప్పం పట్టణ తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటిదాకా రెండు క్లస్టర్లు ఉండేవి. ఒక క్లస్టర్‌కు వి.రవి, మరో క్లస్టర్‌కు త్రిలోక్ ఇన్‌ఛార్జిలుగా ఉండేవారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు కుప్పం పట్టణాన్ని 3 క్లస్టర్లుగా విభజించారు. ఒక క్లస్టర్‌కు కమతమూరు మాజీ సర్పంచి వీజీ.ప్రతాప్, మరో క్లస్టర్‌కు ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, ఇంకో క్లస్టర్‌కు వి.రవిలు ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం ప్రకటించారు.

సోమల తహసీల్దార్‌గా నాగరాజ

సోమల, ఫిబ్రవరి 12: సోమల మండల తహసీల్దార్‌గా ఇ.నాగరాజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సాంబశివయ్య, బి. సురేంద్రబాబు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

సదుం తహసీల్దారుగా...



సదుం, ఫిబ్రవరి 12: సదుం తహసీల్దారుగా నారాయణస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఆయన సదుం వచ్చారు.

ఆదర్శ పాఠశాల వసతిగృహం ప్రారంభం



రొంపిచెర్ల, ఫిబ్రవరి 12: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో నిర్మించిన ఆదర్శపాఠశాల వసతి గృహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. అసంపూర్తిగా మిగిలిన తరగతి గదుల నిర్మాణానికి రూ.50లక్షలు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాల్సిందిగా కలెక్టరుకు సూచించారు. కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పి.పెద్దిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ షేక్‌మోహ్దన్, ప్రిన్సిపాల్ సరళ, పాఠశాల కమిటీచైర్మన్ మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల బైండోవర్

సోమల, ఫిబ్రవరి 12: మండలంలోని పలువురు టీడీపీ నాయకులను సోమల పోలీసులు సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. చంద్రబాబు పుంగనూరు పర్యటన నేపథ్యంలో జరిగిన గొడవల్లో భాగంగా అరెస్టులు జరిగాయి. దీంతో పాటు పలు కేసుల్లో ఉన్న మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, శ్రీనివాసులునాయుడు, హరిప్రసాద్, ఉమాపతినాయుడు, రమణయ్య, పురుషోత్తంతోపాటు పలువురు టీడీపీ కార్యకర్తలను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా మఠంబాబు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి12: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పెద్దమఠం బాబును ఎంపిక చేస్తూ బీజేపీ రాజంపేట జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిష్ఠతకు తన వంతు కృషి చేస్తామన్నారు.

సోమల అధ్యక్షుడిగా శీలం రామూర్తి

సోమల, ఫిబ్రవరి 12: సోమల మండల బీజేపీ అధ్యక్షుడిగా శీలంవారిపల్లెకు చెందిన శీలం రామూర్తిని మూడో పర్యాయం నియమించినట్లు ఆ పార్టీ పుంగనూరు నియోజకవర్గం కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు తెలిపారు. ఆయన నియామకం పట్ల పార్టీ నాయకులు నవీన్, సురేంద్రగుప్తా, యుగంధర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

18నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 : నెల్లిపట్లలో వున్న వీరభద్రస్వామి ఆలయ ఉత్సవాలు ఈనెల 18 నుంచి 20వ తేది వరకు నిర్వహించనున్నట్లు వీరభద్రరజక సహకార సంఘ సభ్యులు తెలిపారు. 18న కలశస్థాపన, ధ్వజారోహణం, గణపతిపూజ, నవగ్రహపూజ, కలశారాధన, 19వతేది భద్రకాళిసమేత వీరభద్రస్వామి కల్యాణం, గ్రామోత్సవం, పూలగెరిగె, 20వతేది అగ్నిగుండం, వసంతోత్సవం, ఉబ్బదేవర మహోత్సవం జరుగుతుందన్నారు.

కాణిపాకంలో వైభవంగా నాగ ప్రతిష్ఠ



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం నాగ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ అర్చక, పండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య నాగ ప్రతిష్ఠ, పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, విగ్రహ ప్రతిష్ఠ, కలశాభిషేకం నిర్వహించారు.

బాబు ష్యూరిటీ కరపత్రాల పంపిణీ



కరపత్రాలిస్తున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12: మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ షికారీ కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి చెంగ్రాయరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి బీఎం రవి, బూత్ కన్వీనర్ ఎన్.శంకరయ్య, డేటా అనాలసిస్ట్ మురళీ, నాయకులు రాజగోపాల్ పాల్గొన్నారు.

డీఎస్సీలో అప్రెంటీస్ వ్యవస్థను రద్దు చేయాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయపురం, ఫిబ్రవరి 12: డీఎస్సీలో అప్రెంటీస్ వ్యవస్థను ప్రవేశపెడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రతులను మండల యూటీఎఫ్ నాయకులు సోమవారం మండల విద్యావనరుల కార్యాలయ ఆవరణలో దహనం చేశారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న అప్రెంటీస్ రద్దును మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టడం వింతగా ఉందన్నారు. అప్రెంటీస్ రద్దు కోసం మళ్లీ పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణా, నాయకులు జనార్దన్, హరిప్రసాద్, బాబు, రవి, హరిష్, నారాయణస్వామి, చంద్రకళ, ఉదయ, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ట్యాబ్ వినియోగించాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 12: సహిత విద్యలో విద్యార్థులకు ఇచ్చిన ప్రతి ట్యాబ్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత సహిత విద్యా కేంద్రాల టీచర్లపై ఉందని సహిత విద్య స్టేట్ ఇన్‌చార్జులు నరసింహులు, సునీల్, అమ్మినాయుడు, ఎం.నాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలాజీ కాలనీలోని సమావేశ మందిరంలో సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ వర్మ అధ్యక్షతన సహిత విద్య టీచర్లకు ట్యాబ్‌ల వినియోగంపై రాష్ట్రస్థాయి అధికారులచే ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మానసికతను కోల్పోయిన పిల్లలు మళ్లీ సాధారణ స్థితికి వచ్చేందుకు తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలోని సహిత విద్యా కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

200వ రోజు అన్నదానం

గుడిపాల, ఫిబ్రవరి 12: మండలంలోని అన్నక్యాంటీన్‌లో సోమవారం 200వ రోజు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో గుడిపాల పంచాయతీ వి.ఎన్. కండ్రిగ గ్రామానికి చెందిన తుమ్మల వాణిశ్రీ జ్ఞాపకార్థం ఆమె భర్త మోహన్ నాయుడు భోజనం వితరణ చేశారు. శంకర్ చౌదరి, కిట్టు, గోపి, శేఖర్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో సోమవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు యువరాజులు నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, చిరంజీవి, ప్రమోద్, దగ్గుబాటి మోహన్, ఏకాంబరం, హిమకర్ నాయుడు, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సారా ఊట ధ్వంసం: ఒకరి అరెస్టు



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పాలసముద్రం, ఫిబ్రవరి 12: మండలంలోని తిరుమలరాజుపురం, నరసింహాపురం అటవీ ప్రాంతాల్లోని నాటు సారా తయారీ స్థావరాలపై సోమవారం పాలసముద్రం ఎస్‌ఐ ప్రసాద్ తన సిబ్బందితో దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న రెండువేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. నరసింహాపురంలో నాటుసారా విక్రయిస్తుండగా వేణుగోపాల్ భార్య వి.లక్ష్మి(47)ని అరెస్టుచేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి నాటుసారా విక్రయిస్తూ పోలీసులను చూసి పారిపోయాడు. అతడి వద్ద 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



ఏకాంబరం (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 12: చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తిరుపతిలోని గిరిపురానికి చెందిన ఏకాంబరం తన సొంతూరైన పూతలపట్టు మండలం, కిచ్చన్నగారిపల్లెకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏకాంబరం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా యువకుడి మృతి



మృతిచెందిన మనోజ్ కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదమరి మండలం గుట్టకిందవూరుకు చెందిన చిట్టిబాబు కుమారుడు మనోజ్ కుమార్ (19) ఇంటి పనుల నిమిత్తం తన సొంత ట్రాక్టర్‌లో బంగారుపాళ్యం మండలం బోడబండ్ల సమీపంలో జల్లి లోడు తీసుకుని గుట్టకిందవూరుకు వెళుతుండగా, కూర్మాయిపల్లె సమీపంలోని చెన్నై-బెంగళూరు హైవే రోడ్డులో ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో మనోజ్‌కుమార్ కింద పడటంతో ట్రాక్టర్ టైరు అతడిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం



బోల్తాపడిన కారు

గుడిపాల, ఫిబ్రవరి 12: మండలంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో కారు బోల్తాపడిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటక రాష్ట్రం హోసకోట నుంచి తమిళనాడు రాష్ట్రం రాణిపేటకు కారులో ఓ డాక్టరు వెళ్తుండగా, అదుపు తప్పి బోల్తాపడింది. ప్రయణిస్తున్న డాక్టరుకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ప్రమాదం తప్పింది. అనంతరం హైవే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా మంజునాథగౌడ్



నగరి, ఫిబ్రవరి 12: నగరి మున్సిపల్ కమిషనర్‌గా మంజునాథగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న కమిషనర్ దివాకర్‌రెడ్డి వారం రోజుల్లోనే బదిలీపై గూడూరుకు వెళ్లారు. మంజునాథగౌడ్ నందికొట్కూరు నుంచి నగరి మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 12: గంగాధరనెల్లూరు మండలం కలిజవేడులో రూ.5లక్షలతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్, కె.నాశంపల్లెలో రూ.15లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సమావేశంలో సర్పంచ్ నీలావతి, జైన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరెడ్డి, నేతలు పూర్ణచంద్రారెడ్డి, చిన్నమరెడ్డి, గుణారెడ్డి, పట్టాభిరెడ్డి, సురేంద్రరెడ్డి, ఏకాంబరం, రూపకుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

నింద్ర, ఫిబ్రవరి 12: మండలంలోని ఎలకాటూరులో ఒకే ప్రాంగణంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షల వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లను సోమవారం మంత్రి రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, సర్పంచ్‌లు ఆదిలక్ష్మి, సంధ్య, సుబ్రమణ్యం రాజు, ఎంపీడీవో భవాని, తహశీల్దార్ నాగమణి, ఏఈ వీరభద్రయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా సుమలత

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12: జీవనోపాధి నిమిత్తం సాంఘిక భద్రతా పథకం కింద చిత్తూరుకు చెందిన బి. సుమలత గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం ఆమెకు నియామక పత్రాన్ని తన ఛాంబర్‌లో అందజేశారు. త్వరలో ఆమెకు కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో లక్ష్మి పోస్టింగ్స్ ఇస్తారని చైర్మన్ తెలిపారు.

ఆసరా చెక్కు పంపిణీ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 12: చిత్తూరు రూరల్ మండలంలోని 574 స్వయం సహాయ సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా 4వ విడత రూ.5.04 కోట్ల మెగా చెక్కును ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మహిళా సంఘాలకు అందజేశారు. సోమవారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏపీవో విజయభాస్కర్, సర్పంచ్ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు 'సిద్ధం'

- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12: సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. సోమవారం నగరంలోని 42, 47వ డివిజన్‌లలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను తన మాయమాటలతో మోసం చేశారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సంక్షేమం పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదలచేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను నిలువునా ముంచారని పేర్కొన్నారు. వివిధ రకాల పన్నుల మోతతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 20ఏళ్ల వెనక్కువెళ్లిందని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, శివ, ఉదయ్, గిరి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అడిషినల్ ఎస్పీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న అడిషినల్ ఎస్పీ

చిత్తూరు, ఫిబ్రవరి 12: జిల్లా అడిషినల్ ఎస్పీ (అడ్మిన్)గా నియమితులైన అరీఫుల్లా సోమవారం కలెక్టర్ షన్మోహన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలు కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12: జిల్లాలో కొనసాగుతున్న పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన ఆర్డీవోలు, రిటర్నింగ్ అధికారులు, వైద్యశాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొన్ని ప్రాంతాల్లో సాంకేతికపరమైన సమస్యలు ఉన్నట్లు కొందరు అధికారులు తన దృష్టికి తెచ్చారన్నారు. సబ్‌రిజిస్ట్రార్లు సమీప గ్రామ సచివాలయాలకు వెళ్లి వాటిని పరిష్కరించాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపులకు సంబంధించిన క్లెయిమ్‌ల నివేదికను ఈనెల 15న కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల విభాగంలో అందజేయాలని రిటర్నింగ్ అధికారులను జేసీ ఆదేశించారు. జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ తులసి, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు యాప్‌లపై అవగాహన అవసరం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 12: ఓటు ప్రాధాన్యతపై ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించడానికి స్వయం సహాయక సంఘ సభ్యులు కృషిచేయాలని డీఆర్డీఏ పీడీ తులసీ పిలుపునిచ్చారు. సోమవారం డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఆమె స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన యువతీ యువకులు తమ ఓటును నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం హెల్ప్ లైన్, దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్, సి విజిల్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చిందని, వీటిపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ మహిళలను చైతన్యపరచడానికి సంఘ సభ్యులు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్షయలేని సమాజ స్థాపనే లక్ష్యం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 12: క్షయలేని సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్‌లో భాగంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరోగ్య కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న 60 ఏళ్లు పైబడిన వారికి, షుగర్, బీపీతో బాధపడుతున్న వారికి ఈ వ్యాక్సిన్ వేయడం ద్వారా టీబీ రాకుండా నివారించవచ్చునన్నారు. టీబీ ఉన్నవారికి రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. డీఐవో రవిరాజు, హెల్త్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి బాధాకరం: మేయర్



ప్రజారోగ్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న మేయర్

చిత్తూరు, ఫిబ్రవరి 12: చిత్తూరు నగరంలో వీధి కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ అముద తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలతో కలిసి మేయర్ చాంబర్‌లో ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరంలో ఆదివారం ఒక్కరోజే పిచ్చికుక్కదాడిలో 40మంది గాయపడటం దురదృష్టకరమన్నారు. నగరంలో కుక్కల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

చిరంజీవిని కలిసిన జనసేన నేత సురేష్‌రెడ్డి



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించిన ప్రముఖ సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవిని గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మ విభూషణ్ అవార్డు వచ్చినందుకు చిరంజీవికి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలకు మంచినీటిని సక్రమంగా అందించండి

నగరి, ఫిబ్రవరి 12: నగరి నియోజకవర్గంలోని ప్రజలకు మంచినీటిని సక్రమంగా అందించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్రకుమార్ అధికారులకు సూచించారు. విజయపురం, నింద్ర మండలాల్లో ఆయన సోమవారం పర్యటించి తాగునీటి సరఫరా పథకాలను పరిశీలించారు. జలజీవన్ మిషన్‌లో ఇంకా ప్రారంభం కాని పనులను స్వయం సహాయక బృందాలకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, శైలేంద్ర, శ్రీకాంత్, అంజేరయ్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

పెనుమూరు, ఫిబ్రవరి 12: ఉపాధి హామీ పథకంలో రోజూ పని చేసే కూలీల సంఖ్యను పెంచేలా చూడాలని డ్వామా పీడీ రాజశేఖర్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన మండలంలోని గుంటిపల్లి, గుత్తావాండ్లవూరులో జరుగుతున్న ఫారంపండ్ పనులను తనిఖీ చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో కూలీలకు తాగునీరు, చల్లటి పానీయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి సిబ్బంది ప్రతీ రోజూ ఉదయం 8.30 గంటలకల్లా ఫీల్డ్‌లో ఉండాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సుబ్రమణ్యం, మణివసన్, వినోద్, పరదేసి, శివ పాల్గొన్నారు.

గుడికి తీసుకున్న భూములకు డబ్బు ఇవ్వలేదు

- దీనివల్ల ఎన్నికల్లో నష్టమని డిప్యూటీ సీఎంకు వైసీపీ నేత ఫిర్యాదు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 12: 'గంగాధర నెల్లూరు మండలం అగర మంగళం వద్ద అంకాళ పరమేశ్వరి గుడి విస్తీర్ణం కోసం ఆ చుట్టుపక్కల రైతుల భూముల్ని దీపక్‌కుమార్ తాళ్ల తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా వారికి ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు. ఆ గుడి యజమాని చర్య వల్ల రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు పడకుండా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామికి జడ్పీటీసీ భర్త, వైసీపీ నేత దుద్దుకూరు దామిశెట్టి విన్నవించారు. కలిజవేడులో ఓ కార్యక్రమానికి సోమవారం హాజరైన డిప్యూటీ సీఎంతో ఆయన మాట్లాడారు. ఆ భూములను తీసిచ్చేందుకు మధ్యవర్తిగా ఓ వైసీపీ నేత ఉండటంతో రైతులంతా ఆగ్రహంతో ఉన్నారు. ఈక్రమంలో వైసీపీ నేత ఈ ఫిర్యాదుచేశారు. దీనిపై గుడియజమానితో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేవిధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జీతాలు చెల్లించి న్యాయం చేయండి సారూ..!

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 12: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష సోమవారానికి 153వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్నా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమన్నారు. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో కుమార్, ఎబినేజర్, రూబెన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులతో పనులు



విద్యార్థులతో పనులు చేయిస్తున్న దృశ్యం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 12: విద్యార్థులతో పాఠశాలలో పనులు చేయిస్తున్న ఘటన చిత్తూరు లక్ష్మీనగర్‌కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. అధికార వైసీపీకి చెందిన ఓ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడే ఇలాంటి చర్యలకు పాల్పడటం విమర్శలకు దారితీస్తోంది. ఆ ఉపాధ్యాయుడు తను విధులు నిర్వహించే పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

టీడీపీని గెలిపించండి: థామస్



నామకరణ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 12: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ అన్నారు. సోమవారం మండలంలోని మంగుంటలో టీడీపీ కార్యకర్త కుమారుడి నామకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, భూపతిరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రబాబురెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరణికి రాజ్యసభ సీటు కేటాయించాల్సిందే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రాజ్యసభ సీటు కేటాయించాల్సిందేనని బలిజ సామాజికవర్గ వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ చిత్తూరులో ఎమ్మెల్యే టికెట్‌ను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి, బలిజ సామాజిక వర్గానికి రాజ్యసభ సీటు కేటాయిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ మాట నిలుపుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో సుమారు 70 నియోజకవర్గాల్లో బలిజ సామాజిక వర్గ ఓటర్లే అధికంగా ఉన్నారని సీఎం గుర్తించాలని పేర్కొన్నారు. ఆరణి శ్రీనివాసులుకు రాజ్యసభ సీటు కేటాయించకపోతే తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని అల్టిమేటం జారీ చేశారు. కార్పొరేటర్లు, నేతలు శ్రీకాంత్, కోలా కిరణ్, పూర్ణచంద్రరావు, రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన సీఎం జగన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12: సీఎం జగన్ నిరుద్యోగులను దగా చేశారని టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభ తేజ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ ఎన్నిల ముందు పాదయాత్రలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగున్నర సంవత్సరాలు పూర్తయి, తిరిగి ఎన్నికలు సమీపిస్తుండగా కేవలం ఒకే ఒక్క నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 13 లక్షల మంది నిరుద్యోగ యువత డీఈడీ, బీఈడీ, ఎంఈడీ చేసి సంవత్సరాల తరబడి ఉద్యోగాలకోసం నిరీక్షిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులే వైసీపీని ఓడిస్తారని హెచ్చరించారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కొండ మల్లీశ్వరస్వామి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12: డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం నిర్వహించారు. స్వామి ని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు దర్శన వసతి కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ ఆవరణంలో అన్నమయ్య, శివ సంకీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.

స్పందన కార్యక్రమంలో నాలుగు వినతులు

చిత్తూరు, ఫిబ్రవరి 12: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు వినతులు అందినట్లు కమిషనర్ అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం బాధితుల నుంచి ఏసీ గోవర్ధన్ అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌శాఖకు 03, ప్రజారోగ్యవిభాగానికి 01 అర్జీ వంతున అందాయి. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై అలసత్వం చూపితే చర్యలు

పెనుమూరు, ఫిబ్రవరి 12: జగనన్న కాలనీల్లో నిర్మించిన నూతన ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయడంలో అలసత్వం చూపితే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు కేవలం 86 ఇళ్లకు మాత్రమే రిజిస్ట్రేషన్‌లు చేశారని, మిగిలినవి ఎందుకు చేయడంలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఒక్క రిజిస్ట్రేషన్ చేయనివారు, వెనుకబడినవారిపై రిపోర్టు రాస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు చెల్లించండి: సీపీఐ

విజయపురం, ఫిబ్రవరి 12: గ్రీన్ అంబాసిడర్‌లకు పెండింగ్ ఉన్న 23 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోదండయ్య, నాయకులు వేలన్, విజయకుమార్, ఏసుపాదం, చెంచురామయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.